ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


అక్రమాలు 'వెలుగు' చూసేనా..!?




● వల్లూరులో రూ.80 లక్షలు పక్కదారి ● ఒకరిపైనే శాఖాపరమైన చర్యలు ● మిగిలిన వారిని కాపాడే ప్రయత్నం
● ఫిర్యాదు చేసినా నమోదుకాని కేసు ● వైసీపీ నేతల ఒత్తిళ్లతోనే మరుగుకు

వల్లూరు మండలంలోని వైఎస్ఆర్ క్రాంతి పథకంలో దాదాపు రూ.80 లక్షలు అధికారులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. స్థానికంగా పని చేస్తున్న ఒక కమ్యూనిటీ కోఆర్డినేటరు నిధులను తన సొంత ఖాతాకు మళ్లించినట్లు సమాచారం. అయితే నిధుల దుర్వినియోగంపై ఇద్దరు ఏరియా కోఆర్డినేటర్లతో పాటు మరికొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ అక్రమాల్లో చాలా మంది పాత్ర ఉన్నప్పటికీ తనను ఒక్కరినే బాధ్యురాలిని చేశారంటూ ఆ మహిళా ఉద్యోగిని వాపోతున్నట్లు చర్చసాగుతుంది. దీనిపై సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నేతల ఒత్తిళ్లతో మరుగున పడేసినట్లు తెలుస్తోంది. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపితే వాస్తవాలు పూర్తి స్థాయిలో వెలుగులోకి వస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

కడప (ఎన్టీఆర్ సర్కిల్), జూన్ 30: ప్రభుత్వం మారిన తరువాతైనా వైఎస్ఆర్ క్రాంతి పథకంలో జరిగిన అవినీతి అక్రమాలు వెలుగు చూసేనా అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని ఆశించినా.. ఎన్నికల ఫలితం వైసీపీ నాయకులు, అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. చాలా మంది ప్రభుత్వ అధికారులు కూడా గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులతో అంటకాగారు. రాష్ట్రంలో వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుంది, తమకు ఎదురు ఉండదనుకున్న వారికి ఎదురుగాలి వీచినట్లయింది. కానీ కొంత మందికి ఉన్నతాధికారుల అండ ఉండడంతో ప్రభుత్వం మారినా చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. వివరాల్లోకి వెళితే..

వల్లూరు మండలంలో కొన్నేళ్లుగా నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. పత్రికల్లో వార్తలు కూడా రావడంతో కలెక్టరు విచారణకు ఆదేశించారు. ముందుగా డీఆర్‌డీఏ అధికారులు విచారణ చేపట్టి నివేదిక సమర్పించారు. అక్రమాలు జరిగినట్లు నివేదికలో పేర్కొనడంతో థర్డ్ పార్టీ విచారణ చేయించాలనే నిర్ణయంతో విచారణ బాధ్యతలు సహకార శాఖాధికారికి కలెక్టరు అప్పగించారు. దీంతో సబ్ డివిజన్‌లో కోఆపరేటివ్ ఆఫీసరు వైఎస్ సత్యానందం విచారణ చేపట్టారు. పలు రికార్డులను పరిశీలించి గ్రామ సమాఖ్యల యానిమేటర్లతో కూడా ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం ఎంత మేర నిధులు దుర్వినియోగం జరిగింది ? ఎలా జరిగింది అనే దానిపై ఒక నివేదికను సమర్పించారు. స్థానికంగా పనిచేస్తున్న ఒక కమ్యూనిటీ కోఆర్డినేటరు నిధులను తన సొంత ఖాతాకు మళ్లించారని విచారణ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నిధుల దుర్వినియోగంపై ఇద్దరు ఏరియా కోఆర్డినేటర్లతో పాటు మరికొంత మంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. సమగ్ర దర్యాప్తు జరిపితే వాస్తవాలు పూర్తిస్థాయిలో వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నట్లు విచారణ అధికారి తన నివేదికలో వివరించినట్లు తెలుస్తోంది.

రూ.80 లక్షలు పక్కదారి

వల్లూరు మండలంలో దశల వారీగా దాదాపు రూ.80 లక్షలు అధికారులు స్వాహా చేసినట్లు సమాచారం. ఇందులో గత టీడీపీ హయాంలో ఇసుక రీచ్‌ల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించారు. ఈ మేరకు తప్పెట్లలోని మహిళా సంఘాలు నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. ఇసుక క్వారీ గడువు ముగిసిన తరువాత నిర్వహణ బాధ్యతలు చేపట్టిన మహిళా సమాఖ్యలకు ఇసుక అమ్మకం ద్వారా వచ్చిన కమిషన్‌ను ప్రభుత్వం మహిళా సమాఖ్యల ఖాతాలో జమ చేసింది. ఈ మొత్తంలో నుంచి దాదాపు రూ.30 లక్షలు ఒక మహిళా ఉద్యోగిని తన బంధువులు, స్నేహితుల ఖాతాల్లో జమ చేశారు. దాదాపు రూ.20 లక్షలు తన పైస్థాయి అధికారికి ఇచ్చినట్లు ఆమె విచారణ అధికారి ఎదుట చెప్పినట్లు తెలుస్తోంది. అయితే అధికారికి నగదు ఇచ్చినట్లు ఆ మహిళా ఉద్యోగి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో ఆమె చెప్పే మాటలను పరిగణలోకి తీసుకోలేదని సమాచారం. వల్లూరు మండలంలో జరిగిన అక్రమాల్లో చాలా మంది పాత్ర ఉన్నప్పటికీ తనను ఒక్కరినే బాధ్యురాలిని చేశారంటూ ఆ మహిళా ఉద్యోగిని వాపోతున్నట్లు చర్చసాగుతుంది. ఈ అంశాలన్నింటిపై విచారణ అధికారి తన నివేదికలో పొందుపరిచారని సమాచారం.

రికార్డులు మాయం

తప్పెట్ల ఇసుక క్వారీకి సంబంధించిన రికార్డులు వల్లూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని విచారణ అధికారి తన నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. రికార్డులు మాయమైనప్పటికీ బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంలో డీఆర్‌డీఏ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. ఇది వరకు జిల్లాలో ఎక్కడైనా ఏ చిన్నపాటి నిధులు దుర్వినియోగమైనప్పటికీ పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉన్నప్పటికీ ఉదాసీనతగా వ్యవహరిస్తున్నారు. ఇదే శాఖలో గతంలో అక్రమాలకు పాల్పడిన బలహీన వర్గాలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకుని జైలుకు పంపిన పరిస్థితులు కూడా ఉన్నాయి. ఈ విధమైన చర్యలు తీసుకోవడంలో ఎక్కువ మంది బలహీనవర్గాలకు చెందిన వారే కావడం చర్చకు దారి తీస్తోంది.


అక్రమాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు (ఫైల్)

వల్లూరులో జరిగిన అక్రమాలకు సంబంధించి అగ్రవర్ణాల వారే కావడం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ఇప్పటి వరకు అధికారుల చర్యలకు బాధ్యులైన సిబ్బంది ఇదెక్కడి న్యాయం అంటూ పెదవి విరుస్తున్నారు. ఏకంగా రికార్డులే మాయమైనప్పటికీ ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకున్న పరిస్థితులు కనిపించడం లేదు. ఉన్నతాధికారులు ఆ దిశగా ఆలోచన చేసే పరిస్థితి కూడా లేనట్లు తెలుస్తోంది. థర్డ్ పార్టీ విచారణ అధికారి పర్యవేక్షణ అధికారుల వైఫల్యాలను తన నివేదికలో ఎత్తి చూపినప్పటికీ చర్య లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఫిర్యాదు చేసినా నమోదు కాని కేసు

వల్లూరు మండల సమాఖ్యలో లక్షల రూపాయల నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై జిల్లా సమాఖ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇది జరిగి నెలలు దాటిపోతున్నా పోలీసులు కేసు నమోదు చేయకుండా తొక్కిపెట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తిప్పిన సోదరులతో పాటు ఒక ప్రజాప్రతినిధి చెప్పడంతోనే మహిళా సమితి ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు బుట్టదాఖలు చేసినట్లు సమాచారం. దీనిపై మహిళా సంఘాల సభ్యులు పదే పదే అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ప్రయోజనం లేకపోయింది. పోలీసులు నిక్కచ్చిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే నిధుల స్వాహాలో వాస్తవాలు వెలుగు చూసే అవకాశాలు లేకపోలేదు. పోలీసులు సైతం రాజకీయ నాయకుల మాటలు విని ఒక ఫిర్యాదును పక్కన పెట్టడం విధుల పట్ల వాళ్ల నిబద్ధతకు దర్పణం పడుతోంది. నెలల కొద్దీ కాలం జరగడంతో అక్రమార్కుల్లో ఇక తమను ఎవరూ ఏమీ చేయలేరని ధైర్యం పెరిగిపోతున్నట్లు తెలుస్తుంది.

ఎమ్మెల్యే దృష్టికి సమస్య

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి మహిళా సమాఖ్య సభ్యులు నిధుల అక్రమాల విషయాన్ని తీసుకెళ్లారు. ఇటీవల మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు మహిళా సంఘాల ప్రతినిధులు తన సమస్యను ఏకరువు పెట్టారు. దీంతో సమావేశంలోనే వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం శైలజను ఆరాతీశారు. మహిళా సంఘాల సభ్యులు ఎక్కడా ఆర్థికంగా నష్టపోకూడదని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే సూచించారు. ఈ అంశంపై ఉన్నతాధికారులతో కూడా చర్చిస్తానని ఆయన మహిళా సంఘాల సభ్యులకు హామీ ఇచ్చారు.

అట్లూరు గ్రామ సమాఖ్యలో రూ.14.06 లక్షలు స్వాహా



అట్లూరు, జూన్ 30: మండలంలోని అట్లూరు, ఎస్.వెంకటాపురం పరిధిలోని గ్రామ సమాఖ్యలో సుమారు రూ.14.06 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు తెలుస్తోంది. మార్చి నెలలో నిధులు దుర్వినియోగంపై స్త్రీనిధి ఏపీఎం నరసింహ, స్థానిక ఏపీఎం సురేశ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఫిర్యాదును స్వీకరించి ఇందులో స్త్రీనిధికి సంబంధించి రూ.3.97 లక్షలు, సీఐఎఫ్ నిధులు రూ.4.78 లక్షలు, ఉన్నతి నిధులు రూ.3.83 లక్షలు గ్రామ సమాఖ్య నిధులు అడ్వాన్సు రూపంలో రూ.1.06 లక్షలు నిధులు మొత్తం రూ.14.60 లక్షలు నిధులు దుర్వినియోగమయ్యాయి. ఈ సమయంలో సీసీలుగా సుబ్బరాయుడు, అర్జున్‌లు విధులు నిర్వహించారు. ఆ నిధులు వీవోఏ వేణుగోపాల్ అప్పులకు జమ కావాలసిన నిధులను జమ చేయకుండా నకిలీ బ్యాంకు స్లిప్పులను డ్వాక్రా మహిళలకు ఇచ్చినట్లు మహిళా సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా నిధుల దుర్వినియోగంపై వీవోఏ వేణుగోపాల్‌పై స్త్రీనిధి ఏజీఎం రమణారెడ్డి, ఏపీఎం నరసింహులు అట్లూరు పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్ఐ కేసీ రాజు వెంటనే విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



పండుగలా పింఛన్ల పంపిణీ

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 30: పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జూలై 1వ తేది నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో ఉన్న రూ.3వేలు పింఛన్‌ను రూ.4వేలకు పెంచుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం జీవో జారీ చేసిందని స్పష్టం చేశారు. ఆదివారం కడప నగరం ద్వారకానగర్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పింఛను పథకం అంచెలంచెలుగా ఎదిగి ఈ రోజు రూ.4వేలకు చేరిందన్నారు. వృద్ధులకు, అవ్వతాతలకు ఇదొక భరోసా ఇచ్చే కార్యక్రమమని, చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. కడప జిల్లాలో గత ప్రభుత్వం పెన్షన్లకు సంబంధించి రూ.79 కోట్లు ఖర్చు చేస్తే, ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం పింఛన్లకు రూ.179 కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 28,634 మందికి గానూ రూ.19.62 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో వలంటీర్లు పింఛన్లను పంపిణీ చేసేవారని, అయితే కడప నగరంలో 1700 మంది వలంటీర్లు ఉంటే గత ఎన్నికలకు ముందు 1500 మంది రాజీనామా చేశారని చెప్పారు. ప్రస్తుతం వలంటీర్లు లేనందున సచివాలయ సిబ్బందితోనే పంపిణీ కార్యక్రమం చేస్తున్నామన్నారు. పింఛన్ల పంపిణీలో టీడీపీ కేడరు పాల్గొంటుందని, వారికి సచివాలయ సిబ్బంది సహకరించాలని తెలిపారు. రాష్ట్రంలో ఖజానా ఖాళీ అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమానికి కొరత లేకుండా చేస్తున్నారన్నారు. 1వ తేది ఉదయాన్నే ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీ కార్యకర్తలతో పాటు సచివాలయ సిబ్బంది పింఛన్లను పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, రాష్ట్ర మైనార్టీ నాయకుడు జిలానీబాషా, టీఎన్ఎస్ఎఫ్ నేత తిరుమలేశ్ పాల్గొన్నారు.

ఫేస్-2 వెబ్ ఆప్షన్స్‌కు షెడ్యూల్ విడుదల

రాయచోటిటౌన్, జూన్ 30: ఉమ్మడి కడప జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో డీఈడీ సెట్ క్వాలిఫై అయిన విద్యార్థులందరూ జూన్ 30వ తేది నుంచి జూలై 4వ తేది వరకు సెకండ్ స్పెల్ వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీట్ అలాట్‌మెంటు జూలై 5వ తేది నుంచి 7వ తేది వరకు ఉంటుందని, 8వ తేది ఏ డైట్‌లో సీట్ వచ్చిందో తెలియజేసి అలాట్‌మెంటు లెటర్ వస్తుందని తెలిపారు. అలాగే 9వ తేది నుంచి 13 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధిత డైట్‌లలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ వివరించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్సీ



కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 30: ఖాళీగా ఉన్న ప్రతి ఉపాధ్యాయ పోస్టును భర్తీ చేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రకటించారని, 1634 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడాన్ని వైసీపీ నేతలు సహించలేక నీలి మీడియా ద్వారా అవాస్తవాలను ప్రసారం చేస్తున్నారన్నారు. ఏ జిల్లాలో ఎన్ని పోస్టులు ఉన్నాయనేది ఇంకా జిల్లా విద్యాశాఖాధికారులు నివేదికలు తయారు చేస్తున్నారని తెలిపారు. ఇంకా అవేమీ రాకముందే వైసీపీ నేతలు నిరుద్యోగులను భయభ్రాంతులకు గురి చేసేందుకు తప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన జీవో 117 ద్వారానే రాష్ట్రంలో ఈ దుస్థితి వచ్చిందని, ఆ జీవో ద్వారా ఉపాధ్యాయులు అదనంగా ఉన్నారని వైసీపీ ప్రభుత్వం లెక్క తేల్చిందన్నారు. అయితే ఖాళీగా ఉన్న ప్రతి పోస్టును ఎన్‌డీఏ ప్రభుత్వం భర్తీ చేస్తుందని తెలిపారు. అలాగే జీవో 117ను పరిశీలిస్తున్నారని దీనిపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉపాధ్యాయ పోస్టులు పెంచేందుకు తగు చర్యలు చేపడుతున్నారన్నారు. నిరుద్యోగ, ఉపాధ్యాయులు వైసీపీ పన్నిన ట్రాప్‌లో పడవద్దని హితవు పలికారు.

తరలిపోతున్న జగనన్న కాలనీ ఇళ్ల మెటీరియల్


పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో కంకరను తరలిస్తున్న టిప్పర్లు

పులివెందుల రూరల్, జూన్ 29: పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల మెటీరియల్ తరలిపోతోంది. ఇళ్ల నిర్మాణానికి తెచ్చిన ఇనుము, ఇసుక, కంకర, సిమెంటు మాయమైపోయాయి. దాదాపు ఐదు టన్నులకు పైగా ఇనుము, వందల టన్నుల ఇసుక, కంకర, వంద బస్తాల సిమెంటు తరలిపోయినట్లు తెలుస్తోంది. ఇందులో సగం కాంట్రాక్ట్ సంస్థ విక్రయించగా మరికొంత స్థానిక ప్రజాప్రతినిధి చేతుల్లోకి వెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రూ.35వేలు డబ్బు కట్టిన వారు మరింత బాధపడుతున్నారు. దీనిపై హౌ సింగ్ ఏఈ సంజీవరాయుడిని వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి పలుమార్లు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. లబ్ధిదారులు హౌసింగ్ కార్యాలయం వద్దకు వెళ్లినా స్పందన లేదని చెబుతున్నారు. అంతేకాకుండా హౌసింగ్ కాలనీలో పాడా నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లోని మో టార్‌ను రెండు రోజుల క్రితం దొంగలు ఎత్తుకెళ్లారు.

అమ్మే నా తొలి గురువు

● తల్లి రిటైర్‌మెంట్ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ భావోద్వేగం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30: అమ్మే నా తొలి గురువు.. నేను బుడిబుడి నడకలు వేసే సమయంలో నా వేలు పట్టుకుని పాఠశాలకు తీసుకెళ్లింది.. ఈరోజు నేను ఓ ఐఏఎస్ అధికారిగా మీముందు ఉన్నానంటే ఆమె ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని తన తల్లి జయభారతి పదవీ విరమణ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ భావోద్వేగానికి గురయ్యారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల సంస్థ చిత్తూరు జిల్లా సమన్వయకర్త జయభారతి ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె కుమారుడు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు ఉన్నత స్థాయిలో కలెక్టర్‌గా ఉన్నానంటే అందుకు తన తల్లే కారణమని, నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించానని, నాకు విద్య చెప్పిన ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవడం సంతోషకరమన్నారు. తిరుపతి ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ గురుకుల పాఠశాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త జయభారతి సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు.



బి.కోడూరులో భూమాయ..!

● దాదాపు 700 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగింపు ● అడ్డగోలుగా వైసీపీ నేతలకు కేటాయింపు ● పెద్దసారు ఏం చెబితే అది అమలు
● రెవెన్యూ, వైసీపీ నేతల కుమ్మక్కు ● కామకుంట, వేమకుంట రైతుల పాపం ఎవరిది ?



బి.కోడూరు, జూన్ 30: అది బద్వేలు నియోజకవర్గంలోని బద్వేలు-పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు. బి.కోడూరు మండలం రోడ్డు పొడవునా 26 కి.మీ విస్తరించి ఉంది. రోడ్డుకిరువైపులా అన్నీ విలువైన ప్రభుత్వ భూములే. ఎకరం రూ.10 నుంచి 20 లక్షలు ఉండడంతో ప్రతి ఒక్కరి కన్ను ఆ భూములపైనే పడింది. అధికార పార్టీ అండదండలతో నాయకులు రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే భూసర్వే చట్టాన్ని అడ్డుపెట్టుకొని సర్వేలు మొదలుపెట్టి ఎప్పటి నుంచో తరతరాలుగా రైతులు సాగు చేసుకుంటున్న దాదాపు 700 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించి వారి అనుయాయులకు కట్టబెట్టారు. ఇదేమని ఏ రైతు అడిగిన పాపాన పోలేదు. కాగా ఇదంతా కట్టడి చేసేందుకు నిఖార్సైన అధికారిని నియమించాలని వైసీపీ ప్రభుత్వం అప్పట్లో బద్వేలు రెవెన్యూ డివిజనుకు ఓ అధికారిని కూడా నియమించింది. ఇప్పటికైనా అధికారులు ఈ భూములపై విచారించి రైతులకు న్యాయం చేస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

పంతాలకు పోయారు..

కామకుంట, వేమకుంట రెవెన్యూ గ్రామాలు పాయలకుంట్ల గ్రామ పంచాయతీలో ఉంటాయి. మున్నెల్లి రెవెన్యూ గ్రామం ఐత్రంపేట గ్రామ పంచాయతీలో ఉంటుంది. అయితే ఇక్కడ అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, కరెంటు రమణారెడ్డికి అనుచరుడు. మరో నాయకుడు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి అనుచరుడు. అయితే ఇరువురు నాయకులు పంతాలకు పోయారు. ఒక నాయకుడు పెద్దసారు దగ్గరకు వెళ్లి మరో నాయకుడిపై పూర్తిగా చెప్పాడు. పెద్దమొత్తంలో ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈరోజు నుంచి తాను చెప్పిందే జరుగుతుందని అనుకున్నాడు. అతనికి తెలియకుండా మరో నాయకుడు పెద్దసారు వద్దకు వెళ్లి పెద్ద మొత్తంలో ముడుపులు చెల్లించినట్లు చెబుతారు. ఇక తాను చెప్పిందే జరుగుతుందనుకున్నాడు. ఇరువురు నాయకులు చెప్పింది గమనించిన ఆ పెద్దసారు ఇక్కడ ఏదో జరుగుతుందని గ్రహించాడు. ఆ విలువైన భూములపై ఆ పెద్దసారు కన్నుపడింది. అదే అదనుగా సచివాలయ సర్వేయరుకు చెప్పి ఎప్పటి నుంచో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూములన్నీ ఆన్‌లైన్ నుంచి తొలగించేలా చేశారు. దాదాపు 400 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఆ పెద్దసారు నాయకులకు మాత్రం ఒక్కొక్కరికి 10 ఎకరాలు, 20 ఎకరాలు, 30 ఎకరాలు కట్టబెట్టాడు. అప్పట్లో మండలంలో ఇది పెద్ద చర్చనీయాంశమైంది.

పత్రికలో రాకుండా చూసుకోండి

పెద్దసారు అధికార పార్టీ నాయకులకు ఎంత కోరితే అంత, ఎక్కడ కావాలంటే అక్కడ భూములు కేటాయించి వారికి మాత్రమే భూములు ఆన్‌లైన్ ఎక్కించినట్లు విమర్శలున్నాయి. ఒక నాయకుడికి ఏకంగా దాదాపు 30 ఎకరాలు కట్టబెట్టి అందలం ఎక్కించాడు. ఆ నాయకుడిది స్థానిక పంచాయతీ కాదు, మండలం కాదు.. వారి పేర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. స్థానిక రైతులు ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న వారి పొలాలు మాత్రం ఆన్‌లైన్ నుంచి తొలగించారు. రైతులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక అప్పటి నుంచి వాపోతున్నారు. అది గమనించిన పెద్దసారు అప్పట్లో అధికార పార్టీ పత్రికలో రాకుండా చూసుకోవాలని ఆ నాయకులకు చెప్పినట్లు గుసగుసలు ఉన్నాయి.

రాత్రికి రాత్రే కంచె

కబ్జా చేసిన భూముల్లో పెద్దసారు అండదండలతో రాత్రికి రాత్రే కంచె, చెట్లు నాటడం ఇవన్నీ చకచకా జరిగిపోయాయి. ఇదేమిటని ప్రశ్నించే వారే కరువయ్యారు. అదే పొలంలో గెస్ట్‌హౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అప్పట్లో ప్రతిపక్ష పార్టీలో ఉన్న టీడీపీ కుయ్యో‌మొర్రో అని మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. లెక్క చేయలేదు.

ఈ సారి ఓట్లు వేయండి.. అన్నీ చేస్తాం

పంచాయతీలోని రైతులంతా మూకుమ్మడిగా కలిసి అప్పట్లో అధికార పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వద్దకు వెళ్లి తమ భూములన్నీ ఆన్‌లైన్ నుంచి తొలగించారు. ఎవరెవరో వందల ఎకరాలు ఆక్రమించుకుంటున్నారు. తమ పరిస్థితేంటని రైతులంతా మొరపెట్టుకోగా ఆ నాయకుడు ఈసారి మీరు అందరూ కలిసి ఓట్లేయండి, మీకు అన్నీ చేస్తా, అంత వరకు తన వద్దకు రావద్దంటూ హుకుం జారీ చేసినట్లు రైతులు వాపోయారు. అప్పటి నుంచి రైతులు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సైలెంట్ అయిపోయారు.

తిప్పరాజుపల్లె రెవెన్యూ గ్రామంలోనూ..

మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామ పంచాయతీ తిప్పరాజుపల్లె రెవెన్యూ గ్రామంలోనూ భూ సర్వే పేరుతో ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న పొలాలు దాదాపు 300 ఎకరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించి రైతులను ఇబ్బందులపాలు చేశారు. గతంలో ఆ రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందారు. ప్రస్తుతం వీరి పేరుతో ఆన్‌లైన్‌లో లేకపోవడంతో రుణాలు రెన్యువల్ చేసుకోలేక ఉన్నారు. బ్యాంకు వారు ఆ రైతుల చుట్టూ తిరుగుతూ రుణాలు రెన్యువల్ చేసుకోండి అంటూ చెబుతున్నారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రెన్యువల్ చేయించుకోవాలంటే భూములు ఆ రైతు పేరు మీద ఆన్‌లైన్‌లో ఉండాలి.

ఈ విషయమై తహసీల్దారు మహేశ్వరిభాయిని వివరణ కోరగా, ఆన్‌లైన్ నుంచి తొలగించిన భూములన్నీ సర్వే చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు.

రాత్రికి రాత్రే చెట్లు నాటిన ఓ నాయకుడు


కంచె వేసిన వైసీపీ నేత


చేపలవేటపై నిఘా కమిటీ ఏర్పాటు

కొండాపురం, జూన్ 30: నేటి నుంచి ఆగస్టు 31 వరకు నిషేధించిన చేపలవేటపై నిఘా కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉప మత్స్య సంచాలకులు కె.శాంతి, మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని గండికోట, బ్రహ్మసాగర్, సోమశిల వెనుకజలాల్లో చేపలవేట జరగకుండా పర్యవేక్షణ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మత్స్య, పోలీసు, రెవెన్యూ, మార్కెటింగ్, అటవీశాఖల సిబ్బందితో చేపల సంరక్షణ కోసం నిఘా కమిటీ పని చేస్తుందన్నారు. కావున ఈ 62 రోజుల సమయంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వెళితే చర్యలు తప్పవని వారు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మిలిటరీ అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత...!

ముద్దనూరు జూన్30: పులివెందుల రోడ్డులోని మల్లేల ఘాట్ వద్ద బస్సులో అక్రమ మిలిటరీ మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఒకరిని శనివారం ముద్దనూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... బెంగుళూరు నుంచి ఒకరు మిలిటరీ మద్యం బాటిళ్లను కొందరు వ్యక్తులకు ప్రతి నెలా అక్రమంగా విక్రయిస్తుంటాడు. నల్లబల్లె వైసీపీకి చెందిన వ్యక్తికి చేరవేసేందుకు దాదాపు 80 మిలిటరీ మద్యం బాటిళ్లు సంచుల్లో తీసుకుని వస్తుండగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే రెండు రోజులుగా దాడి కేసు నమోదు చేయనట్లుంది. ఈవిషయంపై వివరణ కోరేందుకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్దకు ఆంధ్రజ్యోతి విలేకరి వెళ్లగా అక్కడ ఉన్న సిబ్బంది తనకు అక్రమ మద్యం బాటిళ్ల విషయం తెలియదన్నారు. వెంటనే సీఐ, ఎస్ఐలకు ఫోన్ చేసినా వారు స్పందించలేదు, తరువాత కొద్ది సేపటికి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. మిలిటరీ అక్రమ మద్యం బాటిళ్లు మండలంలో చాలా చోట్ల ఒక్కో ఫుల్ బాటిల్ రూ.2500 నుంచి 3000ల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి

కమలాపురం రూరల్, జూన్ 30: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి కోరారు. కమలాపురంలో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన అనేక బహిరంగసభల్లో సీఎం చంద్రబాబు కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేస్తానని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని వాగ్దానం చేసిన దాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఆశా కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలకు స్పందించి రికార్డులు చేస్తామని ఆశా మరణిస్తే మట్టి ఖర్చు రూ.20 వేలు ఇస్తామని సాధారణ సెలవులు, మెటర్నరీ సెలవులు ఇస్తామని చెప్పి ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మరియమ్మ, కల్పన, కోశాధికారి అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, నియోజకవర్గ నేతలు సుధారాణి, అనిత, నాగలక్ష్మి, సుబ్బమ్మ, లక్ష్మిభవాని నారాయణమ్మ, జయకుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 30: గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మ వారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ తల్లి

ఓటీపీనా... అంటే....?

- రోగులకు తలనొప్పిగా మారిన వైనం
- మొబైల్ తప్పనిసరి
- ఓపీలో రోగుల ఇక్కట్లు
- నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది



రక్తపరీక్షల ల్యాబ్‌లో కిటకిటలాడుతున్న రోగులు - రోగులకు ఓటీపీ అడిగి సీట్లు రాస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 30: ఓటీపీ అంటే కూడా తెలియని రోగులను ఓటీపీ చెప్పాలని ఆస్పత్రి వర్గాలు పలురకాల ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేవారు నిరుపేదలు. వారికి కనీస పరిజ్ఞానాన్ని కూడా గుర్తించలేరు. వారిని ఓటీపీ అనడిగితే ఏమని చెప్తారు. రెక్కాడితే గానీ డొక్కారని స్థితిలో ఉన్నవారికి మొబైల్ తప్పనిసరంటూ చెప్పడంతో ఓపీలో రోగులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రిలో రోగుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రోగుల పట్ల నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. వివరాల్లోకెళితే.....

జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం రోగులు రావాలన్నా తలనొప్పిగా మారిందని వాపోతున్నారు. ఒకవైపు ఆస్పత్రిలో నిర్లక్ష్యం, మరోవైపు ప్రతి రోగికి ఓపీలో ఓటీపీ చెబితేనే చీటీలు రాస్తారని రోగులు వాపోతున్నారు. లేనిపోని నిబంధనలు పెట్టి రోగులకు అధికారులు ఇబ్బంది కలిగిస్తున్నారని వాపోతున్నారు. సమీప గ్రామాల నుంచి వివిధ జబ్బులతో వచ్చిన ప్రతి రోగికీ గతంలో ముందుగా ఓపీలో పేరు రాసుకుని చీటీ ఇచ్చేవారు. ప్రస్తుతం సెల్ ఉన్న రోగి మాత్రమే ఓపీకి వెళ్లి ఫోన్ నంబరు చెబితే ఓటీపీ వారి సెల్‌కు వస్తుంది. ఆ ఓటీపీ సిబ్బందికి చెబితే చీటీ రాసి ఇస్తారు. కొందరు వృద్ధులు, కంటిచూపు సరిగా లేని వారు సెల్ ఓటీపీ తమకు తెలియదని, అక్కడే వాపోతున్నారు. దీంతో తాము చేసేది ఏమీ లేదని అధికారులే ఈ విధంగా నిబంధన పెట్టినట్లు సిబ్బంది రోగులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన జ్వరాలు, వల్లు నొప్పులు తదితర ఇబ్బందులతో రోగులు ఆస్పత్రిలో రక్త పరీక్షల ల్యాబ్‌లో కిటకిటలాడుతున్నారు. ఓపీలో ఓటీపీ నిబంధన రద్దు చేయాలని, రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీ గది వద్ద మృతదేహాలను భద్రపరిచే విషయంలో కానీ, విధుల్లో అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్నేళ్లగా ఫెవీకాల్ వీరులున్నారని, వారికి బదిలీ నిబంధనలు వర్తించనట్లుగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ నేతల పలుకుబడితో ప్రభుత్వ ఆస్పత్రిలోనే తిష్టవేసినట్లుగా తెలుస్తోంది. అలాంటి వారిని గుర్తించి పనిచేసే ఉద్యోగులను మాత్రమే పెట్టుకోవాలని పలువురు రోగులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఆస్పత్రిలో పనిచేయని సిబ్బందిని బదిలీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ప్రదర్శన ఇస్తున్న మానస బృందం

పులివెందుల రూరల్, జూన్ 30: స్థానిక ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ధర్మవరం వాసి మానస నృత్య కళాకేంద్రం బృందం ఈ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, నంది అవార్డు గ్రహీత మానస తన బృందంతో శాస్త్రీయ, సినిమా పాటలకు చేసిన నృత్యం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్శకులకు ఏఓ, అవార్డు గ్రహీత మానస కృతజ్ఞతలు తెలిపారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

ధర్మసూక్తులు వినిపించిన బ్రహ్మకుమారీలు



శిల్పారామంలో అలరించిన చిన్నారుల నృత్యాలు

కడప (కల్చరల్), జూన్ 30: నగర పరిధి శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారులు సందడి చేశారు. సాంస్కృతిక కళావేదిక మీద మిస్బా మూవీ ఆధ్వర్యంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కావ్య అక్కయ్య వారిచే ధర్మసూక్తులను ప్రేక్షకులకు వినిపించారు. అనంతరం విజయశాంతి ముద్ర డ్యాన్స్ అకాడమీ వారు పల్లె జానపద, శాస్త్రీయ నృత్యాలు, సినీ గీతాలకు చిన్నారులు తమ బుడి బుడి నడకలతో ప్రేక్షకులను అలరింపజేశారు.

స్కూటీ నడిపే బాలుడికి డీఎస్పీ కౌన్సెలింగ్

మైనర్ డ్రైవింగ్ అరికట్టాలని ఆదేశాలు : డీఎస్పీ



బాలుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు, జూన్ 30: మైనర్లు బైక్ డ్రైవింగ్ చేయడాన్ని అరికట్టాలని డీఎస్పీ మురళీధర్ పోలీసులను ఆదేశించారు. ఆదివారం గాంధీరోడ్డుపై 12 ఏళ్ల బాలుడు ముగ్గురు చిన్న పిల్లలను ఎక్కించుకుని డ్రైవింగ్ చేస్తుండగా డీఎస్పీ మురళీధర్ వారిని నిలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను కానిస్టేబుల్‌తో అదే బైక్ పై ఇంటి వద్ద వదిలేయమని పంపి, తల్లి దండ్రులను తీవ్రంగా మందలించారు. పిల్లలకు బైక్‌లు ఇచ్చి రోడ్లపైకి వదిలితే జరిమానాలు విధిస్తామన్నారు. తల్లి దండ్రులే పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రొత్సహించడం సరికాదన్నారు. మైనర్లు ఎవరైనా డ్రైవింగ్ చేస్తూ పట్టుపడితే తల్లిదండ్రులకు జరిమానాలు విధించాలన్నారు. ప్రమాదాలు జరిగాక బాధపడడం కంటే ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ప్రత్యేక డ్రైవ్ పెట్టి పిల్లలు డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సులేని వారిని పట్టుకోవాలన్నారు. వాహనాలకు ఆర్‌సీ ఇతర గుర్తింపు పత్రాలు లేకుంటే సీజ్‌చేయాలన్నారు.

వక్కిలేరులో ఆక్రమణలు

ఖాజీపేట, జూన్ 30: కొన్నేళ్లగా వక్కిలేరు వంకలో ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా కొద్దిమేర స్థలం కనపడితే వైసీపీ నేతలు, వారి అనుయాయులు ఆక్రమించడం మొదలు పెట్టారు. మరికొందరు వంకలను సైతం పది అడుగుల మేర వంకను ఆక్రమించుకున్నారు. వివరాల్లోకెళితే... మండల పరిధి సుంకేసుల, బీచువారిపల్లెల్లోని పొలాలకు దాదాపు 800 ఎకరాలకు సాగునీరందేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కాల్వలు కొందరు ఆక్రమించుకోగా పూడికలు తీసేందుకు ఆదారిన వెళ్లకపోవడంతో దాదాపు పదేళ్లగా నీరు అందక రైతులు కష్టపడ్డారు. రైతన్నలు ఏమీ చేయలేక వర్షాధార పంటలు సాగు చేసి అరకొర పండించుకునేవారు.



ఆక్రమణలకు గురైన వక్కిలేరు

రైలు కిందపడి వ్యక్తి మృతి

కొండాపురం, జూన్ 30: చౌటిపల్లె యువకుడు రవీంద్ర (32) ఆదివారం రైలు కింద పడి మృతి చెందాడు. ఇతను మద్యానికి బానిసై, మనస్థాపానికి గురై అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని చల్లవారిపల్లె రైల్వే స్టేషన్ వద్ద రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇతనికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.



రవీంద్ర మృతదేహం

ఇసుక వాహనాలు సీజ్



సీజ్‌చేసిన ఇసుక టిప్పర్లు, లారీలు

ఎర్రగుంట్ల, జూన్ 30: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అంకన్నగారి పల్లె వద్ద ఎలాంటి పర్మిట్లు లేకుండా శనివారం రాత్రి మైదుకూరుకు చెందిన వారు రెండు లారీలు, ఒక టిప్పర్‌లో ఇసుకను లోడ్ చేసుకుని నంద్యాలకు తరలిస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. వాటిని సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కడపలో కేరళ పోలీసులు

దొంగను అదుపులోకి తీసుకున్న వైనం

కడప (క్రైం), జూన్ 30: వైజాగ్‌కు చెందిన ఓ వ్యక్తి కేరళలో దొంగతనం చేసి కడపలో తలదాచుకున్నాడు. దీంతో కేరళ పోలీసులు ఆదివారం చిన్నచౌకు ప్రాంతంలో ఉన్న ఆ దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. వైజాగ్‌లోని గాజువాకకు చెందిన సత్తిబాబు పలు పేర్లతో కేళర రాష్ట్రంలో పలు చోరీల్లో నిందితుడు. కడప చిన్నచౌకు ప్రాంతానికి చెందిన ఫోన్ కాంటాక్ట్‌లో ఆ పోలీసులు గుర్తించారు. అయితే నిందితుడు బెంగుళూరు నుంచి కడప ఆర్టీసీ బస్టాండుకు రాగా కేరళ పోలీసులు నిఘా పెట్టి బస్టాండులోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సత్తిబాబును కేరళ పోలీసులు అదుపులోకి తీసుకుని వెళ్లినట్లు సమాచారం.

చాలీ చాలని గదులు - చెట్లకిందే చదువులు



నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం - చెట్లకిందే విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు

బద్వేలుటౌన్, జూన్ 30: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను అందిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి అదనపు భవనాలను నిర్మించుకునేందుకు నాడు - నేడు పనులకు శ్రీకారం చుట్టింది. అయితే పాఠశాలల్లో చేస్తున్న పనులకు నిధులు విడుదల కాకపోవడంతో నత్తేనయం అన్నరీతిలో పనులు సాగాయి. నిధులు వృధా అయినా పర్వాలేదు, చేసినా, చేయకపోయినా మన పేరు మాత్రం కనపడాలి, హడావిడి చేయాలి, ఆర్భాటం ఉండాలి ఇదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ తీరు. అందుకే వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు కొనసాగలేదు. అది రోడ్డుఅయినా, పాఠశాల భవనమైనా, సచివాలయాలైనా అన్నీ అరకొర పనులు మాత్రమే చేసి హంగూ ఆర్భాటాలతో ప్రచారాలు చేసుకోవడమే తప్ప పనులు చేసిన పాపాన పోలేదు. కేంద్రం నిధులతో చేపట్టిన సుమారు 70శాతం పనులు పూర్తి అయినా పాఠశాల భవనాలకు కొద్దిమాత్రమే నిధులివ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి చేతులు రాలేదు. విద్యార్థులు చాలీ చాలని తరగతి గదుల్లో ఉండలేక చెట్లనీడనే ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండడం విశేషం.

వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. 21 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.2.36కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పాఠశాలలో 1780 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు. 50 మందికిపైగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంటర్‌విద్యను కూడా ఇదే పాఠశాలలో అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు అందుబాటులో లేకపోవడంతో చెట్లకిందే కుర్చీపెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. మొత్తం 41సెక్షన్లు ఏర్పాటు కావాల్సి ఉండగా 31 సెక్షన్లకు కుదించారు. దీంతో ఇరుకైన తరగతి గదుల్లో కూర్చుని ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో తరగతి గదికి 4 నుంచి 6 సెక్షన్లు చేశారు. విద్యార్థుల అరుపులు, ధ్వనులు తప్ప ఉపాధ్యాయులు చెప్పేది విన్పించక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రి సకాలంలో రాకపోవడంతో పనులు ముందుకు చురుకుగా సాగడంలేదు. ఇక్కడ చదివే విద్యార్థులంతా ఎక్కువగా బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో ఉంటున్నారు. జిల్లాలోనే పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉండి, విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నదిగా గుర్తింపు పొందింది. ఇప్పటికైనా భవన నిర్మాణ పనులు పూర్తి అయితే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకుని వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధుల కొరతతోనే పనులు చేపట్టలేకపోయాం

పాఠశాలలో నాడు-నేడు పనులు నిధులులేక ఆగిపోయాయని, త్వరితగతిన నిధులు విడుదల చేస్తే భవన నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పాఠాలు చెప్పుకుంటాం.

జి.వెంకటసుబ్బారెడ్డి,
ప్రధానోపాధ్యాయుడు, బాలుర ఉన్నత పాఠశాల

కనపడితే సమాచారం ఇవ్వండి



ఖాజీపేట, జూన్ 30: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఖైరీసా కనపడితే సమాచారం ఇవ్వాలని సీఐ రామాంజులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట మండలం బాలనగర్ వాసి ఖైరీసా శనివారం డ్యూటీ నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల వద్దకు వెళ్లి ఉండవచ్చని విచారించి కనపడకపోవడంతో ఆమె తమ్ముడు పృధ్వీరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, ఈమె ఎక్కడైనా కనపడితే 9121100623 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

భూవివాదం - కేసులు నమోదు

బి.కొత్తకోట, జూన్30: కొత్తపల్లి వద్ద నెలకొన్న భూవివాదంలో ఇరువర్గాలపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు హక్కుగల భూమిలో అక్రమంగా ప్రవేశించి పంటను ధ్వంసం చేశారంటూ బి.కొత్తకోటకు చెందిన మహిళ అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ నేత తిరుమల అమరనాథ్‌తో పాటు ఆరు గురిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా ఈ భూ వ్యవహారంలోనే వెంకట్రమణ ఫిర్యాదు మేరకు అరుణతోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు అదృశ్యం కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 30: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లీబసు తెలిపారు. కురబలకోట మండలం, కోనంగివారిపల్లె వాసి డి. వెంకటేష్ తన భార్యతో కలిసి 19న మదనపల్లెలో ఓ డాక్టర్ వద్దకు వచ్చి అనంతరం రీడింగ్ రూమ్‌వీధిలో షాపింగ్ కోసం వెళ్లారు. కాగా భార్యను అక్కడే వదిలేసి వెంకటేష్ అదృశ్య మయ్యాడు. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికారు. కానరాకపోవడంతో వన్‌టౌన్ సీఐ యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలేరమ్మా చల్లగా దీవించమ్మా



కోట పోలేరమ్మ దేవాలయానికి ఊరేగింపుగా వెళుతున్న తంబాబావివీధి వాసులు



బోనాలతో వెళుతున్న కప్పలపల్లె మహిళలు

పోరుమామిళ్ల, జూన్ 30: కోటపోలేరమ్మా.. చల్లగా దీవించమ్మా అని పోరుమామిళ్లలోని తంబాబావివీధి వాసులు, పెద్దకప్పలపల్లె గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం తంబాబావి వీధి వాసులు కోటపోలేరమ్మకు కుంకుమబండితో, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కప్పలపల్లె మహిళలు కోట పోలేరమ్మ దేవాలయం వరకు పొలాల గుండా భక్తిపారవశ్యంతో బోనాలను తీసుకెళ్లి ఆమెకు సమర్పించారు. కొందరు మహిళలు భక్తిపారవశ్యంతో చిందులు వేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి తమ పంటలు పండేలా చూడాలని అన్ని చెరువులకు నీళ్లు వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. పోరు మామిళ్లలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు.

'యోగివేమన'కు పట్టిన శని విరగడైంది

- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేమన విగ్రహానికి క్షీరాభిషేకం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30: వైవీయూ వర్సిటీకి పట్టిన శని విరగడైందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేశ్ తెలిపారు. ఆదివారం వైవీయూలో యోగివేమన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ అధినేత జగన్ బంధువులు విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రారుగా ఉన్న వీసీ సురేంద్రనాథరెడ్డి ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు ఈ రెండు యూనివర్సిటీల్లో పాలన కుంటుపడిందన్నారు. ప్రభుత్వం మారడంతో వైసీపీకి అంటకాగిన వీసీ, రిజిస్ట్రార్లు అవినీతి భాగోతం బయటపడడంతో సమాధానమివ్వలేక తప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల్లో విభాగాల వారీ దొంగతనంగా ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ఇలా ప్రతి విషయంలోనూ దోచుకుని యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని ఆరోపించారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు భరత్, లోకేశ్, విశ్వనాథ్, టీడీపీ నేతలు పి.డేవిడ్, అమృత్, అరవింద్ పాల్గొన్నారు.



వేమన విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

అక్రమార్కులకు పుట్టినిల్లు జగనన్న కాలనీ

● వందల సంఖ్యలో బినామీ పేర్లతో పట్టాలు, ఇళ్లు ● పక్క జిల్లాల వారికి కూడా పులివెందులలో ఇళ్లు ● చోటా మోటా నాయకుల చేతివాటం

కడప/పులివెందుల, జూన్ 30: పులివెందుల జగనన్న కాలనీ అక్రమాలకు అడ్డాగా మారింది. వందల సంఖ్యలో బినామీలు ఉండడం అది పులివెందులకే చెల్లింది. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చింది కాక మళ్లీ ప్రతి ఇంటికి రూ.35వేలు వసూలు చేశారు. చోటా మోటా నాయకులు వారి చేతివాటం ప్రదర్శించి పక్క జిల్లాల వారికి కూడా పులివెందులలో ఇళ్లు మం జూరు చేయించడం అక్కడి నేతలకే చెల్లింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... పులివెందుల అంటే ప్రస్తుత మాజీ ముఖ్యమంత్రి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో పులివెందులలో ఎవరు అడిగినా పక్కా గృహాల నిర్మాణం సాగిస్తామని ప్రభుత్వం చెప్పింది. దీనిని అదునుగా తీసుకొని కొందరు నాయకులు అక్రమాలకు తెరలేపారు.



పులివెందుల జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 7000కి పైగా పక్కాగృహాలు లేని వారుగా గుర్తించి వారికి పక్కాగృహాలు మంజూరు చేశారు. జేఎన్‌టీయూ కళాశాల వెనుక తొండూరు మండలం గుండ్లమడుగు పంచాయతీలోని భూమిలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి లబ్ధిదారుడికి 1.50సెంట్ల భూమి కేటాయించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

కౌన్సిలర్లు, చోటామోటా నేతలు చెప్పిన వారందరిని ఈ లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. అర్హులా అనర్హులా అని ప్రశ్నే లేకుండా ఇళ్ల మంజూరు సాగించారు. పులివెందులలోని ప్రజలకు మాత్రమే అవకాశం లభించింది. అది మంచిదే. అయితే కొందరు చోటామోటా నాయకులు చెప్పారని పక్క జిల్లాల వారికి కూడా ఇళ్లు కేటాయించడం గమనార్హం. ఇళ్ల నిర్మాణ సమయంలో ప్రభుత్వం ఇచ్చే నిధు లు సరిపడవని ఒక్కో లబ్ధిదారు రూ.35వేలు చెల్లించాలని మున్సిపాలిటీ లబ్ధిదారులకు చెప్పారు. దాదాపు 3వేల నుంచి 4వేల మంది లబ్ధిదారులు రూ.35వేలు మున్సిపాలిటీకి చెల్లించారు. మిగిలిన వారు ఇంకా చెల్లించలేదు. ఈ పక్కా గృహాల నిర్మాణాన్ని రాక్రీట్ అనే సంస్థకు అప్పగించారు. దాదాపు 50 నుంచి 60శాతం పనులు పూర్తయ్యాయి. ఈ పనులు కూడా నాశిరకంగా సాగాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాక్రీట్ అనే సంస్థ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి సంబంధించినది. ఈ సంస్థ పనులు దక్కించుకొని ఏడాది పూర్తయినా 10శాతం కూ డా పూర్తిచేయకపోవడంతో అధికారులు 2500 ఇళ్ల నిర్మాణం మరో సం స్థకు ఇచ్చేలా నిర్ణయించారు. ఆ మేరకు డీఈసీ అనే సంస్థకు పనులు అప్పగించారు. ఆ సంస్థ మొదట్లో చకచకా పనులు చేసింది. మూడు నెలలు గడిచే సరికి ఆ పనులుకూడా నెమ్మదించాయి.

మరో నెలకే నిలిపివేశారు. దీంతో పాటు సిమెంటు రోడ్డు నిర్మాణాలు, డ్రైనేజీ, విద్యుత్ లైన్లు తదితర పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. 09.05.2024 వరకు జరిగిన పనులు చూస్తే ఎన్ఎస్ 206, పీసీ 26, పీబీ 277, బీఎల్ 1506, పీసీసీ 148, ఎల్ఎల్ 60, ఆర్ఎల్ 2026, ఆర్‌సీ 1432, ప్లాస్టింగ్ 1386. దాదాపు 7000వేలకు పైగా ఉన్న ఇళ్ల ప్లాస్టింగ్ 1386 జరిగాయంటే అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఇళ్ల నిర్మాణంపై ఉంచిన శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం రూ.35వేలు చెల్లించిన లబ్ధిదారులు లబోదిబో మంటున్నారు. ఒకవేళ అనర్హులను ఏరివేసే క్రమంలో నిజమైన లబ్ధిదారులమైన తమ కు అన్యాయం జరుగుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





రోడ్డు కోసం కంకరపరిచి వదిలేసిన దృశ్యం... గత జనవరిలో కొన్ని ఇళ్లకు స్లాబ్ కోసం పోటుకట్టెలు వేసి వదిలేసిన దృశ్యం

విద్యారంగంలో విజయభాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివి

కొండాపురం, జూన్ 30: విద్యారంగంలో ఎం.విజయభాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివని కొండాపురం ఎంఈఓలు ఓబులేసు, రామయ్య తెలిపారు. మండలంలోని చౌటిపల్లె జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్‌గా ఆదివారం ఎం.విజయభాస్కర్‌రెడ్డి పదవీ విరమణ చేయడంతో విజయభాస్కర్ రెడ్డి దంపతులను ఎంఈఓలతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తన పదవీకాలంలో ఆయన అనేక మంది వి ద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారని, ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని పలువురు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ క్రిష్టారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజయభాస్కర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30: కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం కలిశారు. ఆమెకు దుశ్సాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

డయేరియా నివారణకు పరిశుభ్రత పాటించాలి

వేంపల్లె, జూన్ 30: పరిశుభ్రత పాటించడం వలన డయేరియా నివారణ సాధ్యపడుతుందని ఎంపీహెచ్ఈఓ ఫక్రుద్దీన్ సూచించారు.ఆదివారం శ్రీచైతన్య పాఠశాలలో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనానికి ముందు, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత బయట నుంచి ఇంటికి వచ్చిన తర్వాత చేతులు, కాళ్లు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఆశావర్కర్లు భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం

పులివెందుల టౌన్, జూన్ 30: మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని రక్షించుకుందామని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, కడప జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యర్రబల్లె గ్రామంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో భాంగా అమ్మపేరుతో చెట్లు నాటడం కార్యక్రమం నిర్వహించారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు: ఎస్ఐ

కడప (నాగరాజుపేట), జూన్ 30 : యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దని రెండో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్ఐ సంజీవరాయుడు అన్నారు. ఆదివారం నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో అమీర్ హాలు ఎదురుగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలతో నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవీరెడ్డి సూచనల మేరకు గౌస్‌నగర్ టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అమానుల్లా, షేక్ లయన్ పఠాన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం మత్తు పదార్థాలకు బానిస కాకూడదని యువతా మేలుకో అని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ సంజీవరాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలో యువత గంజాయి, మత్తు ఇంజక్షన్లు ఎక్కువ వాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు బుల్లెట్ నూర్, ఖాదురు, హబీబుల్లా, షేక్ షఫీవుల్లా, షేక్ సోలో మదర్, చాను, గౌస్‌నగర్ మత పెద్దలు, వలి, అబ్దుల్ రషీద్, గఫూర్ పాల్గొన్నారు.

బలిజేపల్లె వారి అద్భుత సృష్టి సత్యహరిశ్చంద్ర

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30 : తెలుగులో వచ్చిన వందలాది నాటకాల్లో బలిజేపల్లె లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర మేలు అని అద్భుత సృష్టి అని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో నిర్వహించిన బలిజేపల్లె వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల ఓబయ్య, రామసుబ్బయ్య, జ్యోతిజార్జి, సంటెన్న, చెన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ఎర్రగుంట్ల, జూన్ 30: చిన్ననాటి మధుర స్మృతులను ఎన్నటికి మరువలేమని చిలమకూరు జడ్పీహైస్కూల్ 1982-1987 పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 37ఏళ్ల తరువాత ఒకే చోట చదువుకున్న తాము కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ కలుసుకోవడం చాలా ఆనందాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీచేశారు.



గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, జూన్ 30: చింతకొమ్మదిన్నె మం డలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరడంతో అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడిపారు.



పూజలు అందుకుంటున్న చింతకొమ్మదిన్నె గంగమ్మ

నేడు ఇళ్ల వద్దే రూ.7000 పింఛన్ పంపిణీ

● పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూన్ 30: పింఛన్‌ను భారీగా పెంచి బకాయిలు కూడా కలిపి ఇవ్వనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ నాయకుల వరకు అందరు కలిసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లాలని ఆదేశించింది. అందుకు గాను ఎక్కడికక్కడ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాటుచేశారు. అందులో భాగంగా పులివెందుల ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పులివెందుల నియోజకవర్గంలోని కొన్ని మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఇస్తున్న రూ.3వేలు పింఛన్ ఒకేసారి రూ.4వేలకు పెంచింది. ఈ పెంపు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అమలు చేయనుంది.పింఛన్ బకాయిలు కలిపి ఒక్కో లబ్ధిదారుడికి ఏకంగా రూ.7వేలు అందించనున్నారు. పెంచిన పింఛన్ రూ.4వేలు, మూడు నెలల బకాయి రూ.3వేలు మొత్తం కలుపుకొని రూ.7వేలను నేడు వృద్ధులు, వితంతువులు, చేనేతలు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, గీత కార్మికులు, చర్మకారులకు ప్రభుత్వం ఇంటి వద్దకే అందించనుంది. దీంతో పాటు దివ్యాగులకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.3వేలను ఒకేసారి రూ.6వేలకు పెంచి ఇంటివద్దనే అందజేయనున్నారు. పెరాలసిస్ ఇతర తీవ్రవ్యాధులతో బాధపడుతూ పూర్తిగా మంచానికే పరిమితమై ఉన్న వారికిఇప్పటి వరకు రూ.5వేలు పింఛన్ అందజేశారు. ఇక నుంచి వీరికి ప్రతి నెల రూ.15వేలు అందనుంది. తలసేమియ, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.5వేలను ప్రభుత్వం ఏకంగా రూ.10వేలకు పెంచేసింది. ఈ మేరకు ఉన్నతాధికారులు జిల్లాలోని అధికారులు, మండల, మున్సిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో పులివెందులమున్సిపాలిటీలో 7332 పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

వల్లూరు, జూన్ 30 : పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీఈఓ విజయభాస్కర్ తెలిపారు. జూలై 1న తెల్లవారుజామునుంచే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక: పింఛన్ల పంపిణీలో భాగంగా మండలంలోని పెద్దపుత్త, దుగ్గాయపల్లె గ్రామాలకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో పింఛనుదారులే కాకుండా మండల పరిధిలోని టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, పుత్తా అనుచరులు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 30: రాష్ట్రంలో ఏపీ మాలమహానాడును మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళుతున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్ అన్నారు. నగరంలోని ఏపీ మాలమహానాడు నగర కార్యాలయంలో ఆదివారం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చెంచుల డేవిడ్ సత్యరాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాకట విజయశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఆర్థికంగా, సామాజికంగా మరింత ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు తమ వంతుగా మాలమహానాడు వారి సమస్యలపై ఎల్లప్పుడూ పోరాడుతుందన్నారు.



నినాదాలు చేస్తున్న ఏపీ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాకట విజయశేఖర్

'అన్ని గ్రహాల కన్నా అవని మిన్న'

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30 : అన్ని గ్రహాల కన్నా అవని మిన్న అని గ్రౌండ్ వాటర్ ఆడిట్ డిపార్ట్‌మెంటు విశ్రాంత సంచాలకులు ఎ.వరప్రసాదరావు తెలిపారు. ఆదివారం సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో సీమ సాహిత్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ నదీ సాహిత్యం అనే అంశంపై ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రవహించే నదుల్లో పెన్నానదే పెద్ద నది అని, క్రిష్ణ, గోదావరి నదుల కన్నా ఇదే విస్తారమైనదన్నారు. పెన్నానది పుట్టుక గురించి ఆ నదికి ఉన్న పెన్నేరు, పినాకినీ తదితర పేర్లు ఆ పేర్లు రావడానికి గల కారణాలు వివరించారు.

నేడు పాయసంపల్లెకు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె, జూన్ 30: మండలంలోని పాయసంపల్లె గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి రానున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పింఛన్లు అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు కోరారు.

నేడు పెండ్లిమర్రికి రాక...

పెండ్లిమర్రి, జూన్ 30: మండలంలోని వెల్లటూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సోమవారం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి రానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంగటి గంగిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే చేతులమీదుగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దళితులపై దాడులు చేస్తే సహించేది లేదు

● దళిత ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కిశోర్‌కుమార్

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30 : దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని దళిత ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరం దళిత ఫోరం కార్యాలయంలో ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చోటా దళితులపైనే దాడులు జరుగుతున్నాయని ఇలా ఇక నుంచి అలా కాకుండా దళితులు పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. దళితుల ఆత్మగౌరవం కోసం దళిత ఫోరం సాయుధ పోరాటానికి కూడా వెనుకాడేది లేదని అన్నారు. అందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి పోరాటం చేసేందుకు దళిత ఫోరం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు శ్రీరాములు, శ్యాంసన్, ప్రభాకర్, కిరణ్, కరుణాకర్, బండి రమణ పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

పులివెందుల రూరల్, జూన్ 30: పట్టణంలోని దివ్యాంగులకు తన తండ్రి జ్ఞాపకార్థం కుమారుడు దుప్పట్లు పంపిణీ చేసినట్లు వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు.ఆదివారం వస్త్రవ్యాపారి స్వర్గీయ తలుపుల వెంకట సుబ్బారావు జయంతి సందర్భంగా ఆయన కుమారుడు తలుపుల సుగుణాకర్ దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పీఎస్ నగర్‌పై సవతిప్రేమను చూపారు: ఆర్సీపీ

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 30 : నగర శివారు ప్రాంతమైన పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. ఐదేళ్ల నుంచి పరిష్కారానికి నోచుకోని సమస్యలను తెలిపారు. పీఎస్‌నగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. మౌలిక వసతులు అసలే లేవన్నారు. కొత్త ప్రభుత్వమైనా పీఎస్‌నగర్ సమస్యలపై స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా కోగటం ఉరుసు ఉత్సవం

కమలాపురం రూరల్, జూన్ 30 : మండల పరిధిలోని కోగటంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్ది ససిర్రహు వారి ఉరుసు ఆదివారం ఘనంగా జరిగింది. మోపూరి యల్లారెడ్డి ఇంటి నుంచి జెండా ఊరేగింపు చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



దర్గాలో పూజలు చేస్తున్న పుత్తా

'మానవత'తో అందరికీ సహాయం చేద్దాం

చెన్నూరు,జూన్ 30: మానవతా స్వచ్ఛంద సంస్థ ద్వారా అందరికీ సాయం చేద్దాం అని ఆ సంస్థ అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరు రామాలయంలో ఆదివారం సాయంత్రం మానవతా సేవా సంస్థ నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మందిని సభ్యులుగా చేసుకుని నిరంతరం సేవలందిస్తోందన్నారు. కేంద్ర నియంత్రణ కమిటీ సభ్యుడు గోపి మాట్లాడుతూ శాంతిరథాలు, ఉచిత వాహనాలు, బాడీఫ్రీజర్లు అందిస్తూ తద్వారా ఏ ఒక్కరూ అనాథగా చనిపోకుండా సంస్థ ఆధ్వర్యంలో వారి ఖననక్రియలను చివరి మజిలీని దగ్గరుండి జరిపిస్తున్నట్లు తెలిపారు.

నూతన కమిటీ ఏర్పాటు: నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆవుల బసిరెడ్డి, కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, కోశాధికారిగా నారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యుడిగా చైతన్య, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, పాండురంగ, బయపురెడ్డిలను ఎన్నుకున్నారు.

మానవతా రథాన్ని ప్రారంభించిన సంస్థ సభ్యులు

యువనేత గుగ్గిళ్ల చాణక్య అందించిన ఉచిత వాహనాన్ని సంస్థ సభ్యుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం ఆపద సమయాల్లో ఉచితంగా వైద్యశాలలకు తీసుకెళ్లేందుకు, అలాగే వైద్యశాల నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు ఉపయోగించనున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, గోదిన శ్రీనివాసులు, ఆకుల ప్రసాద్‌బాబు, ఆరవేటి శ్రీనివాసరాజు, అతికారి కిశోర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30 : ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఉర్దూ టీచర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు పి.మహబూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ద్వితీయ అధికార బాష అయిన ఉర్దూను అలాగే ఉర్దూ పాఠశాలలను కాపాడాలని కోరారు. జీవో 117రద్దు చేసి ఉర్దూ పాఠశాలల్లో ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ప్రపంచశాంతికి మూలం హిందూ ధర్మం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 30: ప్రపంచ శాంతికి మూలం హిందూ ధర్మం అని శృంగేరీ శారదాపీఠ ఆస్థాన పండితుడు డాక్టర్ పాశంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి పేర్కొన్నారు. అమ్మవారిశాలలో నిర్వహించిన ప్రవనాల్లో భాగంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో హిందూ ధర్మం స్థిరంగా ఉన్నంత కాలం ప్రపంచం బాగుంటుందన్నారు. మనిషిగా ఎలా పుట్టాలో రామాయణం చెబితే ధర్మబద్ధంగా ఎలా బతకాలో భారతం చెబుతుంది. ప్రశాంతంగా ఎలా మరణించాలో భాగవతం చెబుతుందన్నారు. యువకులు ఎలా ఉండాలో ప్రహ్లాదుని పాత్ర ద్వారా వ్యాసమహర్షి బోధించారన్నారు. అనంతరం డాక్టర్ పాశంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రిని ఆర్యవైశ్య సభ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, రవీంద్రబాబు, మురికి సుబ్రహ్మణ్యం, మిట్టా శంకర్, భక్తులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో అన్నీ సమస్యలే...

● ఇరుకైన రోడ్లు... దారుణంగా డ్రైనేజీ ● పందుల బెడద ● వేధిస్తున్న చెత్తబండ్ల కొరత ● పాత వాహనాలతో పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు ● ప్రశాంతతకు పార్కులు లేని వైనం

జమ్మలమడుగు, జూన్ 30 - జమ్మలమడుగు డివిజన్ కేంద్రం. నగర పంచాయతీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గత ప్రభుత్వం నగర పంచాయతీ పరిధిలో అయిదు సంవత్సరాల కాలంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో వివిధ సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులో భాగంగా ప్రధానంగా ప్రధాన రోడ్లు ఇరుకుగా మారాయి. వంద సంవత్సరాల నుంచి ఉన్న రోడ్లు ఇప్పటికీ అలానే ఇరుకుగా మారి టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రధాన రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేసినా పట్టించుకొనే నాథుడు లేడని ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ అతి దారుణంగా మారింది. ఎక్కడ చూసినా డ్రైనేజీ కాలువలు కొన్ని చోట్ల సన్నవిగా ఉండి వ్యర్థాలు నిండి మరికొన్ని చోట్ల ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ శుభ్రం చేయక కంపుకొడుతోంది. దానికి తోడుగా పట్టణంలోని ఎత్తపువారి కాలనీ, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, తదితర వీధుల్లో పందుల బెడద అధికంగా ఉంది. వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది తీసుకెళ్లాలన్నా పాత వాహనాలతో 15 సంవత్సరాల కాలం నాటి బండ్లు తుప్పు పట్టి కొన్ని పనికిరాకుండాపోయాయి. పాత బస్టాండు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు, అలాగే ప్రొద్దుటూరు రోడ్డు, కూరగాయల మార్కెట్‌వీధి వ్యాపారులు ముందుకు సాగి నిర్మాణాలు చేయడంతో ఇరుకైన రోడ్లలోనే వాహనాలు నిర్లక్ష్యంగా నిలుపుతుండడం వలన ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా 108 వాహనం నిలపాలన్నా ప్రైవేటు వాహనాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి ఎదురుగా దుకాణాలు, తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా ప్రొద్దుటూరు రోడ్డులో కాలువలకు ముందు భాగానికి వచ్చిన ప్రతి ఒక్కరి నిర్మాణాలను తొలగించాలని కోరుతున్నారు. కూరగాయల మార్కెట్ ఎత్తులో కట్టడం వలన అక్కడ వ్యాపారాలు జరుగక ప్రజలు పైకి వచ్చి సరుకులు తీసుకెళ్లలేక కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారడం, వ్యాపారులంతా రోడ్డుపైకి చేరారు. ఈ సమస్య పది సంవత్సరాల నుంచి వేధిస్తోంది. పాత బస్టాండులో ప్రయాణికులకు బస్సు షెల్టర్లు లేవు. వర్షం వచ్చినా ఎండ, గాలికి దుమ్ముకొట్టుకుంటూ బస్సు వచ్చే వరకు నిలబడి ఉండాల్సి వస్తోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయం, పాత పోలీసు స్టేషన్ భవనం ప్రాంతాల్లో అక్కడికి పనులపై వచ్చినవారు ద్విచక్ర వాహనాలు పెట్టుకోవాలన్నా పోలీసుల బెడద కొందరు నియంతగా మారి వారికి అనుకూలమైన వారిని మాత్రమే వాహనాలు పెట్టుకునే విధంగా చెబుతున్నారని, కొత్తవారికి ద్విచక్ర వాహనాలు పెట్టకుండా ఇబ్బంది కలిగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూరగాయల మార్కెట్ వీధిలో వస్త్ర వ్యాపారులు అందుకు సంబంధించిన గట్టాలు రోడ్డుపైన పెట్టడం, ద్విచక్ర వాహనాలు, వ్యాపారుల వలన దారి ఇరుకుగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో చెత్త,వ్యర్థాలు కాలువల్లో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. ప్రొద్దుటూరు రోడ్డులో దేవగుడి బ్రాంచ్ కెనాల్ కాలువ మురుగునీటికి నిలయంగా మారింది. పట్టణంలోని సిమెంటు రోడ్లు పలుచోట్ల గుంతలు పడి రోడ్లు సక్రమంగా లేక డ్రైనేజీ కాలువలు దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా రోడ్డు నెర్రెలు చీలింది. రాత్రి సమయాల్లో రైల్వేస్టేషన్‌వెళ్లే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఆ రోడ్డులో రోటరీ నగర్ స్థితి దారుణంగా మారింది. అలాగే భాగ్యనగర్ కాలనీ, బురుజు వీధి తదితర చోట్ల డ్రైనేజీ కాలువలు దారుణంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల ఆవరణాల్లో వర్షపునీరు చేరి విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. పీఆర్ హైస్కూలు మైదానం వివిధ నిర్మాణాలు చేపట్టడం వలన ఇరుకుగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ప్రశాంతంగా సాయంత్రం వేళల్లో వాకింగ్, కూర్చోవడానికి పార్కులు లేవు. మున్సిపాలిటీ కార్యాలయానికి దగ్గరలో లేదా ప్రొద్దుటూరు రోడ్డులో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, దేవగుడి శంకర్‌రెడ్డి సుబ్బరామిరెడ్డి ట్రస్టు తరుపున స్థలాన్ని కొనుగోలు చేసి ఒక పెద్ద పార్కు ఏర్పాటు చేస్తే చిరస్థాయికి పేరుతోపాటు ప్రజలకు మంచిసౌకర్యం ఉంటుందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు ఉన్నాయని, సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితమై సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు సౌకర్యం కల్పించి మున్సిపాలిటిని అభివృద్ధి చేస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.


మురుగు నీటికి నిలయంగా మారిన దేవగుడి బ్రాంచ్ కెనాల్




పారిశుద్యం తీసుకెళ్లే తుప్పు పట్టిన ట్రాక్టర్, నిరుపయోగంగా మారిన చెత్త వాహనాలు

పింఛన్లు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలి - పుట్టా

మైదుకూరు, జూన్ 30 : ప్రతి లబ్ధిదారునికి పింఛన్లను ఇంటికి వెళ్లి ఇవ్వాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పిలుపునిచ్చారు. అయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జులై 1న లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ వెయ్యి రూపాయలు పెంచి మొత్తం 4 వేలతో పాటు గత మూడు నెలలకు సంబంధించి 3 వేలు మొత్తం కలపి 7 వేలు అందచేయాలని సచివాలయం అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూడా దగ్గరుండి పాల్గొని డబ్బులు ఇచ్చేలా చూడాలని కోరారు. నియోజకవర్గంలో మొత్తం దాదాపు 36 వేల మంది ఉన్నారని, వీరికి 24 కోట్ల రూపాయలు నగదు పంపిణీకి సిద్ధంగా డబ్బులున్నాయన్నారు.

నేటి నుంచి పెన్షన్ల పంపిణీ

రాజుపాలెం, జూన్ 30 : జులై నెల 1వతేదీ సోమవారం ఉదయం 6గంటల నుంచి పెన్షన్ల పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో షేక్ ఆలీఖాన్ తెలిపారు. మొత్తం 15 పంచాయతీలకు గాను 4750 పెన్షన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. 11 సచివాలయాల నుంచి ఈ పెన్షన్ అన్ని గ్రామాల్లో పంపిణీకి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 3 కోట్ల 12 లక్షలా 47 వేల రూపాయలు వృద్ధులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల, జూన్ 30: ఆర్టీపీపీ-ప్రొద్దుటూరు వయా రామేశ్వరం రోడ్డు పనులు వెంటనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే సి.ఆది నారాయణరెడ్డి తెలిపారు. రోడ్డు విషయంపై ఆదివారం ఆర్టీపీపీ మాజీ ఎంపీటీసీ నాగమణి, 1535యూనియన్ నాయకుడు రమణయ్య ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు అధ్వాన స్థితిలో ఉండటంతో పోట్లదుర్తిని చుట్టేసి రావాల్సి వస్తోందని ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోచ్చారు. ఈవిషయంపై స్పందించిన ఆయన వీటికి నిధులు మంజూరు చేయించామన్నారు.

ఎమ్మెల్యే ఆది దృష్టికి పలు సమస్యలు


ఎమ్మెల్యేని కలిసి సమస్యలు తెలుపుతున్న అంగన్వాడీలు, ఇతరులు

జమ్మలమడుగు, జూన్ 30: జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఆదివారం నియోజకవర్గంలోని కూటమి నేతలు, ఇతర అధికారులు తదితరులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిశారు. ఆయా గ్రామాల్లో, మండలాల్లో ఉన్న సమస్యలను తెలిపారు. ప్రధానంగా ముద్దనూరు మండల కేంద్రంలో వివేకవర్ధిని జూనియర్ కళాశాలకు చెందిన సిబ్బంది సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు, ఏఐటీయూసీ జమ్మలమడుగు ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సమస్యలు తెలిపారు.

డ్రైనేజీవ్యవస్థ ఆధునికీకరణ పనులు వేగంగా జరగాలి

ప్రొద్దుటూరు, జూన్ 30 : ప్రొద్దుటూరులో అస్తవ్యస్తంగావున్న డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ పనులను వేగంగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు, ఆదివారం టీడీపీ కార్యాలయంలో పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈలు చెన్నకేశవ రెడ్డి, సాయిక్రిష్ణ మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిలుతదితరులు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు ప్రొద్దుటూరు పట్టణంలో 163 కోట్లతో చేపట్టదలిచిన మురికి కాలువల ఆధునికీకరణ పనులపై పబ్లిక్ హెల్త్ అధికారులతో చర్చించారు.

ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన బీజేపీ నాయకులు

బద్వేలుటౌన్ జూన్ 30 : బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఉన్న ఆర్టీసీ బస్టాండును ఆదివారం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో స్లాబు పెచ్చులూడి కిందపడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని, దాంతో అధికారులు స్లాబును తొలగించడంతో ప్రయాణికులు ఎండ, వానకు అక్కడే నిలుచొని ప్రయాణం చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావుతో, డిప్యూటీ ఈఓతో ఫోన్‌లో మాట్లాడి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేఖర్‌రాయల్, హనుమంతు, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.


బీకోడూరు... పదవీ విరమణ పొందిన రాజుపాలెం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కే. రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వైఎస్ఆర్ కడపజిల్లాగా పేరు మార్చాలి


మాట్లాడుతున్న రామయ్య

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 30: ప్రజల సాంఘిక పరిస్థితులకు, చరిత్రకు అద్దం పట్టే కడపజిల్లాకు వైఎస్ఆర్ పేరు పెట్టడం తగదని వైఎస్ఆర్ కడపజిల్లాగా పేరు మార్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో గీతాంజలి హైస్కూలులో వైఎస్ఆర్ కడపజిల్లాగా పేరు మార్చాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నాయకుల కన్నా చరిత్ర, సంస్కృతి గొప్పదని, కడప ప్రాంత చరిత్ర, సంస్కృతిని ఇనుమడించిన మహనీయులు ఎందరో ఈ జిల్లాలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, రచయితలు జింకా సుబ్రమణ్యం, బాబాహయత్, బసవరాజు వేణుగోపాల్, విరసం వరలక్ష్మి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, గంగాసుధాకర్, హరి పాల్గొన్నారు.

కొండ సుంకేసులలో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ



పెద్దముడియం, జూన్ 30 : మండల పరిధిలోని కొండ సుంకేసుల గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకన్న భూపేశ్‌కు మండల వ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ అభిమానులు, కార్యకర్తలు గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలవేసి బాణసంచా పేలుస్తూ పెద్దఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. ఊరేగింపుగావెళ్లి భూపేశ్‌రెడ్డి గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'పీఆర్‌సీపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుంది'

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 30: పీఆర్‌సీపై ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంతృప్తి కలిగే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో ప్రొద్దుటూరు తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి రెడ్డయ్యయాదవ్, కోశాధికారి లక్ష్మణ్ణ, విశ్రాంత ఉద్యోగులు జయరామిరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



ఎర్రగుంట్ల, జూన్ 30: చిన్ననాటి మధుర స్మృతులను ఎన్నటికి మరువలేమని చిలమకూరు జడ్పీహైస్కూల్ 1982-1987 పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 37ఏళ్ల తరువాత ఒకే చోట చదువుకున్న తాము కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడ కలుసుకోవడం చాలా ఆనందాన్నిచ్చిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీచేశారు.

ఆ కుటుంబంలో 20 మంది వైద్యులు


డాక్టర్ వైవీ రామమునిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 30: డాక్టర్ వైవీ రామమునిరెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితులు. ప్రొద్దుటూరు మండలం శంకరాపురంలో మోపూరి సుబ్బారెడ్డి, సుబ్బమ్మలకు జన్మించిన వైవీ రామమునిరెడ్డి తన గురువు ప్రోత్సాహంతో వైద్య విద్యను అభ్యసించారు. టీబీ రోడ్డులో కంటి వైద్యశాలను ఏర్పాటు చేసి అనతి కాలంలోనే ప్రజల మన్ననలు పొందారు. ఆయన కుటుంబ సభ్యులు ఒక్కొక్కరిగా వైద్యవిద్యను అభ్యసించి వైద్యులుగా కొనసాగుతున్నారు. తన కుటుంబం నుంచి 20 మంది వైద్య వృత్తిని నిర్వహిస్తున్నారు. వారిలో 9 మంది కంటి వైద్యులుగా రాణిస్తున్నారు. జిల్లాలో ఇంత మంది వైద్యులు ఉన్న ఏకైక కుటుంబం డాక్టర్ రామమునిరెడ్డి కుటుంబం. 84 సంవత్సరాల వయస్సులోనూ డాక్టర్ వైవీ రామమునిరెడ్డి తన వద్దకు వచ్చేవారికి వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఎన్జీవోలు



మైదుకూరు, జూన్ 30 : ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆదివారం ఎన్జీవో నేతలు ఘనంగా సత్కరించారు. నాయకులు గజ్జల చంద్రమౌళి, మాచనూరు రాఘవయ్య, లక్కినేని బాబు తదితరులు కలసి ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి చేరుకొని శాలువా కప్పి సత్కరించారు. ఎన్జీవోలు ఉండేందుకు భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పుట్టాను కోరారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


వరదరాజులరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 30: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కృష్ణ గీతాశ్రమంలో వీహెచ్‌పీ, వివేకానంద సేవా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము కాకుండా పరిపాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సోమా లక్ష్మీనరసయ్య, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు, నియోజకవర్గ కో- కన్వీనర్ గౌరీశంకర్, పట్టణాధ్యక్షుడు నరేంద్ర, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు నాగమునిరెడ్డి, వంకధార వీరభద్రయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బద్వేలు, జూన్ 30: బద్వేలు పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసి ఉన్న మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వర స్వామి , అభయాంజనేయస్వామి దేవాలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.